# గెలుపే లక్ష్యంగా ఇంటింటి ప్రచారం




అచ్చంపేటలో ప్రచారంలో వృద్ధురాలిని ఆప్యాయంగా పలకరిస్తున్న కౌన్సిలర్

బల్మూరు, అక్టోబర్ 30 : తెలంగాణ రాష్ట్రంలో సీఎం కేసీఆర్‌తోనే అన్నివిధాలా అభివృద్ధి చెందుతందని, బీజేపీ, కాంగ్రెస్‌లతో అభివృద్ధి శూన్యమని ఎమ్మెల్యే గువ్వల బాలరాజు అన్నారు. సోమవారం మండలంలోని కొండనాగుల గ్రామంలో ఏర్పాటు చేసిన ముఖ్యనాయకుల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. రాన్నున ఎన్నికల్లో 50 వేల ఓట్లతో విజయం సాధించడం ఖాయమన్నారు. వలస ఓటర్ లిస్టులో ఉన్న ఓటర్లను గుర్తించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ అరుణ నర్సింహరావు, సర్పంచులు శివశంకర్, శ్రీరాంనాయక్,రేవతి, సహదేవు, నాగరాజు, జ్యోతి మనోహర్, ఎంపీటీసీ అంజనేయులు, ఉపసర్పంచ్ యూసుఫ్ తదితరులు ఉన్నారు

**అచ్చంపేటలో జోరుగా ప్రచారం..**

అచ్చంపేట టౌన్, అక్టోబర్ 30 : అచ్చంపేట పట్టణంలోని ప్రతివార్డులోనూ బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు గెలుపే లక్ష్యంగా ఇంటింటి ప్రచారానికి శ్రీకారం చుట్టారు. పట్టణంలోని 2,5 వార్డులలో కౌన్సిలర్‌లు, వార్డు ఇంచార్జిలు, బీఆర్‌ఎస్ కార్యకర్తలు ప్రతి గడగడపకు వెళ్ళి పార్టీ మ్యానిఫెస్టోను చూపిస్తూ ఓటరు మన్ననలు పొందుతున్నారు. ప్రతి ఓటరును పలకరిస్తూ వారి క్షేమ సమాచారాలను అడిగి ప్రభుత్వం ద్వారా విడుదల చేసిన మ్యానిఫెస్టోను వివరించారు. గత ప్రభుత్వాల హయాంలో చేయని పనులు ఈ పదేండ్లలో చేసి చూపించామని, ఇంకా పెండింగ్‌లో ఉన్న పనులు పూర్తి కావాలంటే మళ్లీ బీఆర్‌ఎస్‌కు ఓటు వేయాలని ఓటర్లకు విజ్ఞప్తి చేస్తున్నారు. తాగునీటికి, సాగునీటికి ఎంతో క్లిష్టంగా ఉండేదని, తెలంగాణ ఏర్పడిన తర్వాత ఎమ్మెల్యే గువ్వల బాలరాజు చొరవతో ముఖ్యమంత్రి కేసీఆర్‌పై ఒత్తిడి పెంచి అచ్చంపేటకు తాగు, సాగు నీటి కష్టాలను కడతేర్చారని తెలిపారు. ఎండాకాలంలో కూడా నిండుకుండలా చెరువులు ఉన్నాయంటే దానికి ఎమ్మెల్యే గువ్వల బాలరాజు ప్రోద్బలంతో ఆయన ప్రారంభించిన లిఫ్ట్ ఇరిగేషన్‌ల ద్వారా అని వివరించారు. మనకు మరిన్ని సంక్షేమ ఫలాలు అందాలన్న, నియోజకవర్గం అభివృద్ధి చెందాలన్న మళ్లీ బీఆర్‌ఎస్‌కు ఓటు వేసి భారీ మెజార్టీతో విజయాన్ని అందించాలని ఓటర్లకు సూచించారు. కార్యక్రమంలో ఆకులశ్రీను, కార్యకర్తలు గొర్ల నర్సింహా, ఎస్‌కె షకీర్, అమర్, ఎండీ కరీం,



బల్మూరులో కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గువ్వల

రామకృష్ణ గౌడ్, 2వ వార్డు కౌన్సిలర్ సుంకరి నిర్మలాబాలరాజు, మహేశ్, లింగం, కృష్ణ, రాజు తదితరులు పాల్గొన్నారు. కాగా పట్టణ అధ్యక్షుడు పులిజాల రమేశ్ ఆధ్వర్యంలో సోమవారం కూలీ పనులకు ట్రాక్టర్‌లో వెళ్తున్న మహిళ కూలీలనుమ్యానిఫెస్టోలోని అంశాలు, పథకాలను వారికి వివరించారు.

**కొనసాగుతున్న ప్రచారం..**

అమ్రాబాద్, అక్టోబర్ 30 : మండల కేంద్రంలో సర్పంచ్ శారదశ్రీను ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ నాయకులు ఇంటింటి ప్రచారం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని వెంకటలక్ష్మమ్మ ఆలయం, ఆంజనేయస్వామి ఆలయం, దర్గావద్ద పూజలు, ప్రార్థనలు నిర్వహించి ప్రచారాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ వార్డు మెంబర్లు శ్రీదేవి, జగన్ నాయకులు జావిద్, కిట్టు, శివ, సాధిక్, శ్రీను, నారయ్య, అబ్దుల్లా పాల్గొన్నారు.

**బల్మూరులో..**

బల్మూరు, అక్టోబర్ 30 : అచ్చంపేట ఎమ్మెల్యే అభ్యర్థి ఎమ్మెల్యే గువ్వల బాలరాజు గెలుపుకోసం బీఆర్‌ఎస్ మండల నాయకులు మండలంలోని రాంనాగర్ కాలనీ అభయంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలను చేసి చేసి గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. గువ్వల గెలుపుతోనే అచ్చంపేటకు సాగునీరు అందుతుందని ఎంపీపీ అరుణ అన్నారు. కార్యక్రమంలో సర్పంచులు శ్రీరాంనాయక్, నాగరాజు, శివశంకర్, ఎంపీటీసీ అంజనేయులు ఉన్నారు.

**గువ్వల గెలుపు పేదలకు అవసరం**

వంగూరు, అక్టోబర్ 30 : అచ్చంపేటలో విప్ గువ్వల బాలరాజు మరోసారి గెలవడం పేదలకు అవసరమని కేటీఆర్ సేవా సమితీ జిల్లా అధ్యక్షుడు అంకు సురేందర్ సోమవారం ప్రకటనలో తెలిపారు. గువ్వలను ముచ్చటగా మూడోసారి అసెంబ్లీకి పంపించినప్పుడే అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందన్నారు.



బల్మూరు: రాంనగర్‌కాలనీలో...



అచ్చంపేట 5వ వార్డులో ప్రచారం చేస్తున్న నాయకులు



అచ్చంపేటలో 2వ వార్డులో బీఆర్‌ఎస్ శ్రేణుల ప్రచారం



అచ్చంపేటలో కూలీలకు పథకాలు వివరిస్తున్న నాయకులు



అమ్రాబాద్‌లో పూజలు చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

## నల్లమలవాసికి అబ్దుల్ కలాం సేవా పురస్కారం

అచ్చంపేట రూరల్, అక్టోబర్ 30 : నల్లమలవాసి రాష్ట్ర మేదరి సంఘం ప్రచార కార్యదర్శి, మాతృభూమి స్వచ్ఛంద సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు పట్టణానికి చెందిన ప్యారంసాని రమాకాంత్‌కు అబ్దుల్ కలాం విశిష్ట సేవా పురస్కారం అవార్డును అందించినట్లు ఆయన తెలిపారు. గ్రామీణ ప్రాంతంలో చేస్తున్న సేవలకు గుర్తించి ఆదివారం పొట్టి శ్రీ రాములు తెలుగు విశ్వవిద్యాలయం హైదరాబాద్‌లో ఆర్‌కె కళా సాంస్కృతిక ఫౌండేషన్ ఆధ్వర్యంలో అందజేశారు. కార్యక్రమంలో రిటైర్డ్ జడ్జి మధుసూదన్, ఆంధ్రప్రదేశ్ ఉదయగిరి ఎమ్మెల్యే చంద్రశేఖర్‌రెడ్డి చేతులమీదుగా అవార్డుతో పాటు ప్రశంసాపత్రాన్ని అందజేశారు. స్వచ్ఛంద సంస్థ ద్వారా స్వయం ఉపాధి శిక్షణ ఏర్పాటు చేసి వేలాది మంది నిరుద్యోగ యువకులకు చేయుతను అందించి ప్రయోజనకులను చేశారని పలువురు కొనియాడారు.



పురస్కారం అందుకుంటున్న రమాకాంత్

## విద్యార్థులకుపు స్తకాల పంపిణీ




విద్యార్థులకు పుస్తకాలను అందజేస్తున్న క్లాస్‌మెట్ క్లబ్ సభ్యులు

తాడూరు, అక్టోబర్ 30 : మండలంలోని అంతారం, ఐతోల్ గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు 1600 మేధావుల పుస్తకాలను సోమవారం అందజేశారని క్లాస్‌మెట్ క్లబ్ వ్యవస్థాపకుడు రాఘవేందర్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వివిధ రంగాల్లో గొప్ప చరిత్ర కలిగిన మేధావుల 1600 పుస్తకాలను విద్యార్థులకు అందజేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తదితరులు విద్యార్థులు పాల్గొన్నారు.

## పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించిన ఎంపీడీవో



లింగాలలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో గీతాంజలి

లింగాల, అక్టోబర్ 30 : మండలంలోని అప్పాయిపల్లి గ్రామంలో ఏర్పాటు 210, 211, 212 పోలింగ్ కేంద్రాలను సోమవారం ఎంపీడీవో గీతాంజలి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నవంబర్ 30న నిర్వహించే అసెంబ్లీ ఎన్నికలకు గాను పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా పోలింగ్ కేంద్రాల్లో తాగునీటి, మరుగుదొడ్లు, విద్యుత్ తదితర సౌకర్యాలను ఉన్నాయా లేదా పరిశీలించారు. పరిశీలించిన పోలింగ్ కేంద్రాల నివేధికను ఉన్నతాధికారులకు సమర్పిస్తామని ఆమె తెలిపారు. కార్యక్రమంలో బీఎల్‌వోలు తదితరులు పాల్గొన్నారు.

**బల్మూరులో..**

బల్మూరు, అక్టోబర్ 30 : ఎన్నికలు దగ్గర పడడంతో గ్రామాల్లో పోలింగ్ కేంద్రాల్లో వసతులు, తదితర వాటిని అధికారులు పరిశీలిస్తున్నారు. సోమవారం మండలంలో పోలింగ్ కేంద్రాల నెంబర్‌లు 173, 174, 175, 176, 177, 178 కేంద్రాలను ఎంపీడీవో దేవన్న తనిఖీ చేశారు. అనంతరం బీఎల్‌వోలతో మాట్లాడారు. ఆయన వెంట పీఎస్ కార్యదర్శులు తదితరులు ఉన్నారు.

## ఎంపీ ప్రభాకర్‌రెడ్డిపై దాడి హేయమైన చర్య

వంగూరు, అక్టోబరు 30 : దుబ్బాక ప్రచారంలో వున్న బీఆర్‌ఎస్ అభ్యర్థి ఎంపి కొత్త ప్రభాకర్‌రెడ్డిపై కత్తితో దాడి చేయడం హేయమైన చర్యని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కృష్ణారెడ్డి, గణేశ్‌రావే, సింగిల్‌విండో చైర్మన్ సురేందర్‌రెడ్డి సోమవారం ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో ఏ పార్టీ అయిన ప్రచారంలో విమర్శలు, ప్రతి విమర్శలు చేసుకోవాలే తప్పా భౌతికదాడులు, హత్యాయత్నం వంటి పనులకు తావివ్వొద్దన్నారు. ఇటువంటి నీచమైన పనులతో బీఆర్‌ఎస్‌ను కట్టడి చేయాలనుకుంటే అది వారి ఉనికికే ప్రమాదమన్నారు. ఇటువంటి వ్యక్తులను ప్రోత్సహించే పార్టీలైన, వ్యక్తులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

## విద్యాదాఘాతంతో వ్యక్తి మృతి

■ సబ్‌స్టేషన్ వద్ద ఆందోళన ■ విప్ హామీతో ఆందోళన విరమణ

చారకొండ, అక్టోబర్ 30 : విద్యాదాఘాతంతో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని శాంతిగూడెంలో ఆదివారం రాత్రి చోటు చేసుకున్నది. ఎస్సై రవి కథనం ప్రకారం శాంతిగూడెం గ్రామానికి చెందిన కోళ్ల వెంకటేశ్వర్లు (45) ఉదయం వ్యవసాయ పొలానికి వెళ్లి తిరిగి రాత్రి ఇంటికి వచ్చాడు. తన ఇంటికి ఉన్న ఇనుప మెట్లకు పట్టుకున్నాడు. అదే సమయంలో షాట్‌సర్క్యూట్‌తో ఇనుపమెట్లకు విద్యుత్ సరఫరా కావడంతో షాక్ తగిలి అక్కడిక్కడే కుప్పకూలాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే దవాఖానకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు.

**సబ్‌స్టేషన్ వద్ద మృతదేహంతో ఆందోళన..**

గ్రామంలో గత మూడు, నాలుగు నెలల నుంచి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ సమస్య ఉందని విద్యుత్‌శాఖ అధికారులకు చెప్పిన పట్టించుకోలేదని, అధికారుల నిర్లక్ష్యంతోనే వెంకటేశ్వర్లు మృతి చెందాడని ఆరోపిస్తూ సిరుసనగండ్ల విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద మృతదేహంతో గ్రామస్తులు అర్ధరాత్రి వరకు ఆందోళనకు దిగారు. విద్యుత్‌శాఖ ఉన్నాతాధికారులు వచ్చే వరకు కదిలేది లేదని భీష్మించి కూర్చున్నారు. విషయం తెలుసుకున్న విప్ గువ్వల బాలరాజు అర్ధరాత్రి సిరుసనగండ్ల సబ్‌స్టేషన్‌కు వద్ద చేరుకొని గ్రామస్తులతో మాట్లాడారు. వెంకటేశ్వర్లు కుటుంబాన్ని ప్రభుత్వం ద్వారా అన్ని విధాలుగా ఆదుకుంటామని భరోసా కల్పించడంతో ఆందోళన విరమించారు. బాధిత కుటుంబాన్ని ఆర్థిక సాయం అందజేశారు. వెల్దండ సీఐ సోమనర్సయ్య, చారకొండ, వెల్దండ, వంగూరు ఎస్సైలు రవి, శ్రీనివాస్, కురుమూర్తి ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. మృతుడికి భార్య పద్మతో పాటు కుమారుడు, కుమార్తె ఉన్నారు. భార్య పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వ దవాఖానకు తరలించారు.



బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న విప్ గువ్వల